క్లుప్తంగా

మాంసం దుకాణాల తనిఖీ



మాంసం దుకాణాలను తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ

సాలూరు: పట్టణంలోని మాంసం దుకాణాల ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. మాంసాలపై జాలీలు వేయని, నిబంధనలు పాటించని పలు దుకాణాలను గుర్తించి అక్కడ మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, నాణ్యమైన మాంసం విక్రయించాలని, దుకాణాల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్న నిబంధనలను వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల జీతాల సమస్య పరిష్కరించరా?



కొల్లి రామకృష్ణ

సాలూరు: మినిమమ్ టైమ్ స్కేల్ ప్రాతిపదికన జిల్లాలో పనిచేస్తున్న 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులు రెండు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని 1998 ఎంటీఎస్ టీచర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సాలూరులో మాట్లాడుతూ జూన్, జూలై నెలలకు సంబంధించిన జీతాలు నేటికీ అందలేదన్నారు. తక్కువ వేతనంతోనే బతుకు ఈడుస్తున్న తమను ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూడడం సరికాదన్నారు. జిల్లాలో క్లస్టర్ టీచర్లుగా సర్దుబాటుచేసి క్లస్టర్ స్కూల్ హెచ్ఎంల పరిధిలోకి తీసుకు వచ్చిన నాటి నుంచి పలు సాంకేతిక కారణాలు చూపుతున్నారే తప్ప జీతాలు పడేలా చేయడం లేదని వాపోయారు. మా కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పశువులకు ఆవాసాలుగా విద్యాలయాలు



గుమడాం సమీపంలో అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనంలో ఉన్న పశువులు

సాలూరు: గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యావ్యవస్థలో నాడు నేడుతో విద్యావ్యవస్థను బలోపేతం చేశారు. ఈ క్రమంలో గత ప్రభుత్వంలో పాఠశాలల భవనాల నిర్మాణం, ఆధునికీకరణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. గత ప్రభుత్వంలో సాలూరు పట్టణంలోని గుమడాం వద్ద మంజూరై చేపట్టిన పాఠశాల భవన నిర్మాణం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిలిచిపోయింది.ఈ ప్రభుత్వంలో బిల్లులు మంజూరుకాకపోవడంతో పనులు ముందుకుసాగడం లేదు. దీంతో సగం నిలిచిన భవన నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. నేడు అవి పశువులకు ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న పాఠశాలల భవనాలను పూర్తిచేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మలేరియా ప్రబలకుండా చర్యలు



పట్టణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వై.మణి

పార్వతీపురంటౌన్: ఏడిస్ దోమల వల్ల పట్టణ ప్రాంతాలలో డెంగీ జ్వరాలు ప్రబలుతాయని, మంచినీరు ఇంటి పరిసర ప్రాంతాలలో నిల్వ లేకుండా చూసుకోవాలని జిల్లా మలేరియా అధికారి వై.మణి అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని జగన్నాథపురం పరిధిలో గల బొగ్గులవీధి, వివేకానంద నగర్ ఠాగూర్ వీధి, కొత్తవలస లోని నందమూరి కాలనీ తదితర ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆయా వీధులలో దొరికిన లార్వాలను ప్రజలకు చూపించి వాటివల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేశారు. జగన్నాథపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను తనిఖీ చేసి అక్కడ చేస్తున్న టెస్టుల వివరాలు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి అవసరమైన వివరాలను ఎల్‌టీ వెంకట రమణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, ఏఎన్ఎంలు శ్యామల, లీల సుజాత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛనర్లు అప్పీల్ చేసుకోవాలి



మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్

సాలూరు: మున్సిపాలిటీలో 20 దివ్యాంగ పింఛన్లు వృద్ధాప్య పింఛన్లుగా మార్చు చేశామని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ, మున్సిపాలిటీలో 70దివ్యాంగ పింఛన్లు వెరిఫికేషన్‌కు వచ్చాయని, మిగిలిన 50 పింఛన్లకు సంబంధించి నోటీసులు అందించామని తెలిపారు. వారు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అప్పీల్ చేయాలని, అలా చేసిన వారిని మళ్లీ వెరిఫికేషన్‌కు పిలవనున్నట్లు తెలిపారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు

- జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలు
- ప్రధాన రహదారిలోనే భారీ వాహనాల రాకపోకలు
- జటిలమవుతున్న సమస్య
- ప్రత్యామ్నాయ రోడ్లతోనే సమస్యకు పరిష్కారం





జిల్లా కేంద్రంలో ట్రాఫిక్, (ఇన్‌సెట్లో) పార్కింగ్ లేకపోవడంతో ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

పార్వతీపురంటౌన్:

జిల్లాకేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలంటే ప్రత్యామ్నాయ రోడ్లు ఏర్పాటు చేయడమే శరణ్యంగా కనిపిస్తోంది. పట్టణంలో ఎక్కడికి వెళ్లాలన్నా ప్రధానంగా రాకపోకలు చేసేది మెయిన్ రోడ్డు పైనుంచే. ఆ రోడ్డు ఉదయం, సాయంత్రం చాలా రద్దీగా ఉంటుంది. వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పట్టణ పరిసర ప్రాంతాల పరిధిలో ఉన్న వారు పనులపై వచ్చే వారి వాహనాలతో పాటు స్కూళ్లు, కళాశాలలు, ఆర్టీసీ బస్సుల తాకిడి కూడా ఎక్కువే. పట్టణంలో నిత్యం సుమారు 10వేల మంది విద్య, వైద్య, వ్యాపార, ప్రభుత్వ కార్యకలాపాల అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణ ప్రధాన రహదారి, బైపాస్ రోడ్డు మీదుగా ఒడిశా రాష్ట్రం రాయగడ, అలమండ, కొరాపుట్ జిల్లాలకు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు ఒక్కటే కావడం వల్ల ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఇబ్బందులు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో బైపాస్ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆ పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రహదారిపై దృష్టిసారించని ఫలితంగా పట్టణ ప్రజలు, జిల్లా కేంద్రానికి వచ్చేవారు, ఒడిశా రాష్ట్రానికి ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రత్యామ్నాయం ఇదే..

- ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పలు ప్రాంతాలను కలిపి నూతన రహదారి నిర్మాణం చేయడం.
- పట్టణ శివారులో గల వెంకంపేట మీదుగా కొమరాడ మండలం శివిని గ్రామం వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రణాళికలు రూపొందించిన బైపాస్ రహదారి నిర్మాణం చేపట్టాలి.
- పట్టణ ప్రధాన రహదారిపై షాపింగ్ మాల్‌లు, వ్యాపార సముదాయాల యజమానులు పార్కింగ్ స్థలం కేటాయించాలి.
- పట్టణ ప్రధాన రహదారిపై కాలువల ఆక్రమణను నియంత్రించాలి.
- స్కూళ్లు, కళాశాలలు, ప్రభుత్వ కార్యకలాపాల సమయాల్లో నో ఎంట్రీ విధించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే పార్కింగ్

పట్టణానికి ప్రధాన రహదారి, ఒడిశా రాష్ట్రానికి వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి అదే కావడం, దానికి తోడు ప్రధాన రహదారిపైనే వ్యాపార సముదాయాలు, మార్కెట్‌లు, ఆర్టీసీ బస్టాండ్, ఆటో స్టాండ్ అన్నీ ఉండడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా షాపింగ్ మాల్‌లు, వ్యాపార సముదాయాల వద్ద సెల్లార్ పార్కింగ్ సదుపాయం లేకపోవడం వల్ల వ్యాపార సముదాయాల ముందు రోడ్డుపైన వాహనాలను పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పార్కింగ్‌కు వ్యాపార సముదాయాల యజమానులు స్థలం కేటాయించకపోవడంతో రహదారిపై పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు తిరిగే సమయాల్లో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

నూతన బైపాస్ వేయాల్సిందే



జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వెంకంపేట గ్రామ శివారు నుంచి కొమరాడ మండలం శివుని వరకు నూతన బైపాస్ ఏర్పాటు చేయాల్సిందే. పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భావం తరువాత ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువైంది. అధికారులు సమస్య పరిష్కారానికి కృషిచేయాలి. – పి. గౌరీ శంకర్రావు, వాహన చోదకుడు పార్వతీపురం పట్టణం

ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు



ప్రజలకు ప్రతినిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పెరుగుతున్న వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కచ్చితంగా ఇబ్బందులు తొలగాలంటే ఇతర ప్రత్యామ్నాయ రోడ్లను ఏర్పాటు చేయడం, రహదారిపై కాలువల ఆక్రమణ తొలగించడంతోనే సమస్యకు చెక్‌పెట్టవచ్చు. – జి. మాధవ్ నాయుడు, పట్టణవాసి

అధికారులు దృష్టి సారించాలి

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరం. పట్టణ ప్రధాన రహదారిపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడం, బస్సులు, ఆటోలు ఎక్కువగా ప్రయాణించడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలను నిలపకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. – బి.జగదీష్, వాహన చోదకుడు

కలుపునివారణ పనుల్లో మహిళా రైతులు



గుచ్చిమిలో వరిలో కలుపు తీస్తున్న మహిళా రైతులు

సీతానగరం: మండలంలో చెరువు నీరు ఆధారంగా రైతులు సాగు చేస్తున్న వరి పొలాల్లో ముందుగా వరినాట్లు వేయడంతో వచ్చిన కలుపు నివారణ పనుల్లో మహిళా రైతులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో లక్ష్మీపురం, వెంకటాపురం, నీలకంఠాపురం, జోగింపేట, గుచ్చిమి, సీతారాంపురం బుడ్డిపేట, పెదభోగిలి, గ్రామాల భూములకు జీవనాధారమైన తాన్నచెరువు ఆయకట్టు భూముల్లో వరినాట్లు ముందుగా వేశారు. వరిచేలు ఏపుగా పెరిగినప్పటికీ కలుపు మొక్కలు పెరగడంతో కలుపు నివారణ చర్యల్లో భాగంగా మహిళా రైతులు వరిచేను మడులలో కలుపు నివారణ పనులు చేస్తున్నారు. అలాగే చెరకు, పత్తి పంటల్లో పేరుకుపోతున్న కలుపు తీస్తున్నామని ఎరువులు అవసరమవుతున్నాయని, వ్యవసాయ శాఖ స్పందించి ఎరువుల కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు గుండె సంబంధిత సమస్యలకు ఉచిత వైద్య శిబిరం

- 18 ఏళ్ల లోపు బాలలు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు

పార్వతీపురంటౌన్: పిల్లలో పుట్టుక, ఎదుగుదల లోపాలు సకాలంలో గుర్తించి, చికిత్స అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఎమ్-ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాంలో బాగంగా పార్వతీపురం జిల్లా ఆస్పత్రి దరిలో ఉన్న డీఈఐసీ కేంద్రంలో పుట్టుక నుంచి 18 ఏళ్ల వరకు ఉన్న బాలలకు సీహెచ్‌డీ, గుండె సంబంధిత సమస్యలకు విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రి నుంచి పిల్లల కార్డియాలజిస్ట్ డా. అశోక్ రాజు వైద్య బృందం వైద్యారోగ్యశాఖ సూచనల మేరకు శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారని గుండె సంబంధిత సమస్యలున్న పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న అంగన్వాడీ, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్‌లో ఆరోగ్య సమస్యలు, లోపాలు, వైకల్యాలు, వ్యాధులు పిల్లల్లో సత్వరమే గుర్తించి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆర్‌బీఎస్‌కే వాహనం ద్వారా డీఈఐసీ కేంద్రానికి చేర్చాలన్నారు. కార్యక్రమంలో డీఈఐసీ పిల్లల వైద్య నిపుణుడు డా.ఎల్. భరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



డిప్యూటీ ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

మక్కువ: మండలకేంద్రం మక్కువ సమీపంలో 13గ్రామాలకు తాగునీరు అందించే సీపీడబ్ల్యూస్కీంను సుమారు 30ఏళ్ల క్రితం ఏర్పాటుచేశారు. సీపీడబ్ల్యూస్కీం ట్యాంక్‌లో నీరు నింపి, అక్కడినుంచి ఆపరేట్‌చేసి, మండలకేంద్రం మక్కువతోపాటు, మరి కొన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తుంటారు. అయితే కొద్దిరోజులుగా సీపీడబ్ల్యూస్కీం ట్యాంక్‌కు నీరు నింపే పంపింగ్‌వాల్ మరమ్మతులకు గురవడంతో నీరు పూర్తిస్థాయిలో ట్యాంక్‌కు చేరడంలేదు. సీపీడబ్ల్యూ స్కీం ట్యాంక్ నీటిసామర్థ్యం సుమారు 2.20లక్షల లీటర్లు ఉంది. అయితే పంపింగ్‌వాల్ మరమ్మతులకు గురవడంతో సుమారు 50వేల లీటర్లు మాత్రమే ట్యాంక్‌లోకి నీరుచేరడంతో, పైప్‌లైన్ ద్వారా పూర్తిస్థాయిలో నీరు సరఫరాకాకపోవడంతో, శివారు వీధుల్లో ఏర్పాటుచేసిన కుళాయిలకు సక్రమంగా నీరు అందడంలేదు.
ఈ నేపథ్యంలో మక్కువలోని కూరాకుల దిగువ వీధి, ఎగువవీధి, నాయిబ్రాహ్మణ వీధి, జాలారి వీధుల్లో ఏర్పాటుచేసిన కుళాయిలకు ఐదు నెలలుగా నీరు పూర్తిస్థాయిలో సరఫరా కాలేదంటూ శుక్రవారం ఆయా వీధులకు చెందిన పలువురు మహిళలు ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. స్థానిక టీడీపీ నాయకుడి సోదరి ఆధ్వర్యంలో మహిళలు చేరుకుని ఆయా వీధుల సమీపంలో కల్వర్టు పనులు చేపట్టడంతో, పైప్‌లైన్ మరమ్మతులకు గురై కుళాయిలకు నీరు సరఫరాకావడంలేదని ఆరోపించారు. అంతేకాకుండా నీరు కలుషితమవుతోందంటూ డిప్యూటీ ఎంపీడీవో ఎన్.సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీఎంకే రెడ్డిని కలిసి తాగునీటి సమస్యను వివరించి, వినతిపత్రం అందించారు. కుళాయిలకు ఎందుకు నీరు సరఫరా అవడంలేదో పరిశీలించి, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో మహిళలు వెనుదిరిగారు.

శ్రావణ లక్ష్మికి ప్రత్యేక పూజలు



కామాక్షమ్మ ఆలయం ఆవరణలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు, (ఇన్‌సెట్లో) భక్తులకు దర్శన మిస్తున్న కామాక్షమ్మ తల్లి.

సాలూరు: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. విశేష అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని కామాక్షమ్మ తల్లి, వాసవికన్యకాపరమేశ్వరి, పంచముఖేశ్వర, సంతోషీమాత తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వేతనదారులు ఉపాధి పనులు వినియోగించుకోవాలి

సీతానగరం: మండలంలో ఎన్ఆర్ఈజీ ఎస్ పథకం ద్వారా కల్పిస్తున్న పనులు వేతనదారులు వినియోగించు కోవాలని జెడ్పీ మాజీ సభ్యుడు అంబటి కృష్ణంనాయుడు, అన్నారు. ఉపాధిహామీ పథకం శ్రామికులకు గ్రామాల్లో కల్పిస్తున్న అవగాహన సదస్సు, గ్రామసభల్లో భాగంగా శుక్రవారం అంటిపేటలో సర్పంచ్ బి.తిరుపతి రావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు వై.భాస్కరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి అర్హులైన కుటుంబాల వారు పనులు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులు మెరుగ్గా ఉన్నాయని, సామాజిక పరమైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎస్ఆర్‌పీ దాసు మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్(ఐఈసీ)టీం ద్వారా గ్రామాల్లో ఉండే శ్రామికులకు ఉపాధి హామీ పథకంలో హక్కులు, సౌకర్యాలు, రాజీలేని అంశాలపై, గ్రామానికి సంబంధించిన చిత్రపటాన్ని వేసి ప్రజలకు వివరించారు. అనంతరం ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ బాలకృష్ణ, జేఈ సోమేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సోషల్‌ఆడిట్ సిబ్బంది, శ్రీను, సురేష్ రమేష్,మూర్తి పాల్గొన్నారు.

గత ప్రభుత్వ జీవో మేరకు వేతనాలు పెంచాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు



కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పార్వతీపురం రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో చెత్తసేకరణ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు రూ.10వేలు వేతనాలు పెంచుతూ ఇచ్చిన జీఓ మేరకు పెంపుదల చేసి ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రీన్ అంబాసిడర్ల జీతాల బకాయిలతో పాటు పలు సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 మండలాల్లో 943 మంది కార్మికులు ఉన్నారని, గతంలో వారికి నేరుగా జీతాలు చెల్లించేవారని, ప్రస్తుతం పంచాయతీలకు అప్పగించి కార్యదర్శులు ఇవ్వాల్సి ఉండగా పంచాయతీల్లో నిధులు లేని కారణంగా దాదాపు పది నెలలుగా జీతాల బకాయిలు చెల్లించకుండా అవస్థలకు గురిచేస్తున్నారన్నారు. ఇచ్చిన రూ. 6వేలు కూడా సక్రమంగా ఇవ్వకపోతే ఏ విధంగా కార్మికులు బతుకుతారని ప్రశ్నించారు. గ్రీన్ అంబాసిడర్లకు జీతం రూ.18వేలకు పెంచాలని, అలాగే వారి రక్షణ మేరకు సేఫ్టీ జాకెట్లు, మాస్కులు, గ్లౌజ్‌లతోపాటు జీవిత బీమా సౌకర్యం కల్పించి ప్రతినెల 5వ తేదీలోపే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్‌లో వినాయక మంటపాలకు అనుమతులు



బలిజిపేట వేంకటేశ్వరస్వామి ఆవరణలో వినాయక ఉత్సవాలకు సిద్ధమవుతున్న మంటపం

బలిజిపేట: వినాయకచవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పోలీస్‌శాఖ చెబుతోంది. మంటపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని సూచిస్తోంది. పబ్లిక్ ప్రదేశాల్లో మంటపాలు, పందిళ్లు ఏర్పాటుచేసి వినాయక విగ్రహాలు ప్రతిష్టించుకునే భక్తుల సౌకర్యార్థం సులభంగా అనుమతులు పొందేందుకు సింగిల్ విండో విధానాన్ని పోలీస్ శాఖ ప్రవేశపెట్టింది. దీనికి వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసింది. మంటపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని సూచిస్తున్నారు. దరఖాస్తుదారు పోలీస్ స్టేషన్లు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. సంబంధిత పోలీస్ అధికారి స్వయంగా పందిరి, మంటప స్థలాన్ని తనిఖీ చేస్తారు.

నిబంధనలు పాటించాలి



గ్రామాల్లో వినాయచవితి ఉత్సవాలను నిర్వహించేటప్పుడు తప్పకుండా నిబంధనలు పాటించాలి. పోలీస్‌శాఖ సూచించన ప్రకారం అనుమతులు తీసుకోవాలి. అనుమతుల ప్రకారం నిర్వహణ ఉండాలి.
– సింహాచలం, ఎస్సై, బలిజిపేట

టీకాతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

- డీఎంహెచ్‌ఓ డా.భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డా.భాస్కరరావు

పార్వతీపురంటౌన్: నిర్దేశించిన సమయానికి పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వ్యాధినిరోధక టీకాలు వేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు టీకా కార్యక్రమం, సర్వేలెన్స్‌పై జిల్లాస్థాయి వర్క్‌షాప్ శుక్రవారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించారు. డబ్ల్యూహెచ్‌ఓ సర్వేలెన్స్ అధికారి జాన్ జూడ్ జాషువా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఇమ్యునైజేషన్‌పై రీఓరియంటేషన్ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో, హెపటైటిస్, క్షయ, కోరింత దగ్గు, న్యూమోనియా, కంఠసర్పి, తట్టు, అతిసారం, డిఫ్తీరియా, ధనుర్వాతం మొదలగు ప్రాణాంతక వ్యాధులకు గురికాకుండా పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. జిల్లాలో శతశాతం టీకాలు పూర్తి చేయడమే లక్ష్యంగా వైద్యాధికారులు, వైద్యసిబ్బంది కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఐఓ డా వై.విజయమోహన్, పీఓ ఆర్బీఎస్‌కే డాక్టర్ టి.జగన్మోహనరావు, ఎపిడమాలజిస్ట్ డా కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు



ఇప్పలవలస వద్ద కోతకు గురైన బీటీరోడ్డు



ప్రమాదకరంగా ఉన్న బీటీరోడ్డు మలుపు

సీతానగరం: మండలంలోని విశాఖ–పార్వతీపురం ప్రధాన రహదారిని ఆనుకుని జోగింపేట జంక్షన్ నుంచి నిరంతరం ప్రజలు తిరుగాడే బీటీ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయాగ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విశాఖ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు, ఇతరపనులకోసం మండల కేంద్రానికి వెళ్లవలసిన పాపమ్మవలస, ఇప్పవలస, జోగింపేట, నీలకంఠాపురం, నిడగల్లు, జోగింపేట గ్రామాల ప్రజలు, విద్యార్థులు రహదారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే చాలు ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నామని ఆయాగ్రామాల ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డు అభివృద్ధి పనులు చేస్తామన్న నాయకులు అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్నా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. తక్షణమే రోడ్డును పరిశీలించి కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు సర్వర్ కష్టాలు



సర్వర్ పనిచేయక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

సాలూరు: డిగ్రీలో ప్రవేశాలకు సర్వర్ పనిచేయక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. డిగ్రీలో ప్రవేశాల కోసం ఓఏఎండీసీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థులు ఈ వెబ్‌సైట్‌లో వారి సర్టిఫికెట్లతో కూడిన వివరాలను పొందుపరచాల్సి ఉంది. అయితే ఈ వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు.ఈ నెల 26వ తేదీనే ఆఖరు కావడంతో గడువు సమీపిస్తున్నా సర్వర్ పనిచేయకపోవడంతో ఏం చేయాలో తెలియక అయోమయానికి లోనవుతున్నారు.హెల్ప్‌డెస్క్ నంబరు కూడా పనిచేయడం లేదని వాపోతున్నారు. స్థానిక డిగ్రీ కళాశాలకు వచ్చిన విద్యార్థులకు వారి వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది సర్వర్ పనిచేయకపోవడంతో కంప్యూటర్‌తో కుస్తీ పట్టడం కనిపించింది. ముందు పేజీలో ఎర్రర్ రాగా తరువాత ఏకంగా వెబ్‌సైటే ఓపెన్ కాలేదని విద్యార్థులు చెబుతున్నారు. కావున ప్రభుత్వం స్పందించి సర్వర్ సమస్య తక్షణమే పరిష్కరించి, డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ సజావుగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

కులధ్రువీకరణ సర్టిఫికెట్స్ దర్యాప్తు వేగవంతం



కుల ధ్రువీకరణ పత్రాలు వెరిఫికేషన్ చేస్తున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజలకు ఇదివరలో పంపిణీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు దొర్లిన వాటిని వీర్వోలు వెరిఫికేషన్ వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు గ్రామాల్లో ప్రారంభించిన సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదంకలాం,లక్ష్మీపురం గ్రామాల్లో వీఆర్వోలు ఇంటింటికీ వెళ్లి చేస్తున్న సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ను తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూమోటోగా ఇది వరలో తహసీల్దార్ కార్యాలయం నుంచి మంజూరుచేసిన సమయంలో కేస్ట్ సర్టిఫికెట్స్‌లో 5 వేల పత్రాల్లో తప్పులున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రభుత్వం అప్పట్లో మంజూరుచేసిన కుల ధ్రువీకరణ పత్రాలపై దర్యాప్తు చేయడానికి సూమోటోగా వెరిఫికేషన్ చేయాలని మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. దీంతో అసలైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు కొత్తగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, కృష్ణారాయపురం, పెదంకలాం, లక్ష్మీపురం, ఏగోటివలస వీఆర్వోలు అశ్విని, ఆనందరావు పాల్గొన్నారు.

తవ్వకాల అనుమతులు రద్దుచేయాలి

పార్వతీపురం రూరల్: మండలంలోని ములగ గ్రామాల పరిధిలో ఉన్న బడిదేవరమ్మ కొండ మైనింగ్ తవ్వకాలకు ఇచ్చిన అన్ని రకాల అనుమతులను రద్దుచేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొండపై మైనింగ్ తవ్వకాల కారణంగా చుట్టుపక్కల పర్యావరణానికి, తాగునీటికి ముప్పు పొంచి ఉందన్నారు. ఈ మేరకు పరిసర ప్రాంతాల్లో పంటపొలాలు నాశనమవుతున్నాయని వివరించారు. పాలకులు, అధికారులు మైనింగ్ యాజమాన్యానికి సహకరించడం వల్లే తవ్వకాలు అడ్డుగోలుగా జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.